# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 14 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 320

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ప్రమాణం




2లో

# నీట్‌లో 1563 మందికి గ్రేస్ మార్కుల తొలగింపు

- వారికి మరోమారు పరీక్ష రాసే అవకాశం
- లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఇంటర్వ్యూ
- సుప్రీంకు తెలియచేసిన కేంద్ర ప్రభుత్వం
- నీట్ కౌన్సిలింగ్‌పై స్టేకు సుప్రీం నిరాకరణ
- విచారణ జూలై 8కు వాయిదా

'కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారికి మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తాం. జూన్ 23న పరీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీలోగా వారి ఫలితాలను ప్రకటిస్తాం' అని ధర్మాసనానికి కేంద్రం వెల్లడించింది.

# కొడంగల్‌కు మహర్దశ

## గురుకులాలకు రూ.73.45 కోట్లు మంజూరు



**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో బీసీ గురుకుల విద్యా సంస్థల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.73.45 కోట్లు మంజూరు చేసింది. కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ పరిధిలో బీసీ గురుకుల జూనియర్ కాలేజీ నిర్మాణానికి రూ.25 కోట్లు, బీసీ గురుకుల పాఠశాల కోసం రూ.23.45 కోట్లు, బొమ్మరసిపేట మండలం బురాన్‌పేటలో బీసీ బాలికల గురుకుల పాఠశాల, కాలేజీ నిర్మాణానికి మరో రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## పాఠ్యపుస్తకాలను వాపస్ తెప్పించడం

# దారుణం

**హైదరాబాద్:** తెలుగు పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరుంటే తప్పేంటని మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంలో జగన్ బొమ్మలతో కూడిన కిట్లను పిల్లలకు యధావిధిగా పంపిణీ చేయాలని, ప్రజాధనం వృధా చేయొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ సీఎం చంద్రబాబు హుందాగా వ్యవహరించారు. ఆయనను చూసి నేర్చుకోవాలని రేవంత్‌కు సబిత చురకలంటించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగు పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరు ఉండడంతో ఆ పుస్తకాలను తిరిగి తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై సబిత స్పందించారు. కేసీఆర్ ఫొటో, కేసీఆర్ గుర్తు తొలగించాలనే ఆలోచనను పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలని రేవంత్‌కు సబిత సూచించారు. ఆరు నెలలైనా ఈ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించలేదు అనడానికి ఈ వ్యవహారమే ప్రత్యేక నిదర్శనం. తమిళనాడులో స్టాలిన్ ముఖ్యమంత్రి కాగానే జయలలిత ఫొటోతో ఉన్న బుక్స్, బ్యాగ్స్‌ను యధావిధిగా విద్యార్థులకు ఇచ్చి తమ హుందాతనాన్ని చాటుకున్నారు. పక్క రాష్ట్రం సీఎం చంద్రబాబు.. జగన్ బొమ్మతో గల కిట్లను పంపిణీ చేయాలని, ప్రజా ధనం వృధా చేయకండని ఆదేశించి ఎంతో హుందాగా వ్యవహరించారు. మరి మీ హుందాతనం ఎక్కడికి పోయిందని రేవంత్‌ను నిలదీశారు.



- ముందుమాటలో కెసిఆర్ పేరు ఉంటే తప్పేంటి
- డబ్బులు వృధా చేయడం తప్ప మరోటి కాదు
- ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డ సబిత, దేశపతి

## జి 7 దేశాల సదస్సులో పాల్గొననున్న మోడీ ఇటలీ పయనం



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీకి పయనమయ్యారు. ప్రధాని జార్జియా మెలోనీ ఆహ్వానం మేరకు ఆ దేశంలో ప్రారంభమైన జీ7 దేశాల వార్షిక సదస్సులో ఆయన పాల్గొన నున్నారు. కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే. దీనిపై ఆయన హర్షం వ్యక్తంచేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. జీ7 చర్చల్లో భాగంగా కృత్రిమ మేధ, ఇంధనం, ఆఫ్రికా, మధ్యధరా, గ్లోబల్ సౌత్ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనే ఇతర నేతలతో భేటీ అయ్యేందుకు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఇటలీలోని బోర్గో ఎగ్నాజియా ప్రాంతంలోని ఓ లగ్జరీ రిసార్ట్‌లో జీ7 దేశాల సదస్సు (జూన్ 13-15) ప్రారంభమైంది. అమెరికా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, ఇమాన్యుయేల్ మెక్రాన్, జపాన్, కెనడా, బ్రిటన్ ప్రధానులు ఫుమియో కిషిదా, జస్టిన్ ట్రూడో, రిషి సునాక్, జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ తదితర నేతలు ఇప్పటికే అక్కడికి చేరుకున్నారు. జార్జియా మెలోనీ వారికి స్వాగతం పలికారు.



3లో..

## కెసిఆర్‌పై ఇడి కేసు నమోదు

గొర్రెల కుంభకోణంలో విచారణ : ఎంపి రఘునందన్

# సీతారామ ప్రాజెక్ట్ పేరు మారుస్తాం!



రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేస్తాం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**భద్రాద్రి కొత్తగూడెం:** గత ప్రభుత్వం రూ. 9వేల కోట్లు ఖర్చు పెట్టినా కూడా ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. జిల్లాలోని ములకలపల్లి మండలం పూసగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్‌ను తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్..పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అధికారులు ఇచ్చారు. 6 నెలల్లో చాలా ప్రాజెక్టులు సందర్శించానని.. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు చాలా అన్యాయం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్ట్ పూర్తి అయ్యాక సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా పేరు పెడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేవలం రూ. 2654 కోట్ల తో అయ్యే ప్రాజెక్టును రూ. 20,000 కోట్లు పెంచి ప్రజాధనాన్ని మాజీ సీఎం కేసీఆర్ దుర్వినియోగం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. గత ప్రభుత్వం రూ. 8000 కోట్లు ఖర్చుపెట్టి కూడా ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారం వచ్చిన వెంటనే రివ్యూ చేసి ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.



3లో..

# రాష్ట్రంలో మహిళాశక్తి క్యాంటీన్లు

- ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష
- ఇతర రాష్ట్రాల క్యాంటీన్ల పనితీరుపై ఆరా



3లో..

## దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంచుతాం

స్వయం సమృద్ధి సాధించేలా కృషి

బాధ్యతలు స్వీకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న ప్రమాణం



**హైదరాబాద్:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రమాణ స్వీకారం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సమక్షంలో ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ ఛాంబర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు ఏ పదవి చేయలేదని తనను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించిన అందరికి దన్యవాదాలని అన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసిన గ్రాడ్యుయేట్లందరికి ధన్యవాదాలని బాధ్యత గలిగిన వ్యక్తిగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణా రావు, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంఛార్జి దీపా దాస్ మున్షీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్‌లో 1563 మందికి గ్రేస్ మార్కుల తొలగింపు




**న్యూఢిల్లీ:** ఎంబీబీఎస్, బీడీఎస్..ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)– యూజీ 2024లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఫలితాల్లో 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను తొలగిస్తామని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని చెప్పింది. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థులకు అదనంగా గ్రేస్ మార్కులు ఇచ్చారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్ష కేంద్రాల వద్ద సమయం కోల్పోవడంతో వీటిని కలిపారు. అయితే దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో పాటు నీట్ పరీక్షలో అక్రమాలపై ఆరోపణలు రావడంతో గతవారం కేంద్ర విద్యాశాఖ నలుగురు సభ్యులతో కమిటీ వేసింది. కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన 1563 విద్యార్థులపై ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది.

కమిటీ నిర్ణయాలను కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. 'కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారికి మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తాం. జూన్ 23న పరీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీలోగా వారి ఫలితాలను ప్రకటిస్తాం' అని ధర్మాసనానికి కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాతే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపింది. ఒకవేళ మళ్లీ పరీక్ష రాయొద్దని అనుకునే వారు.. గ్రేస్ మార్కులు లేకుండా ఒరిజినల్ మార్కులతో కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చని పేర్కొంది. ఇక, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. వెబ్ కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని చెప్పిన ధర్మాసనం.. ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగానే సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. జులై 6వ తేదీ నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే 'ఫిజిక్స్ వాలా' విద్యాసంస్థ వ్యవస్థాపకుడు అలఖ్ పాండే దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విద్యార్థులకు ర్యాండమ్‌గా 70 నుంచి 80 మార్కులు కలిపారని అన్నారు. ఇదిలావుంటే

నీట్ పై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వాగతించారు. నీట్ లో అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకుంటుందన్నారు. నీట్ పరీక్షలో సమస్యలకు కారణమైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో


ముడిపడిన విషయంలో.. రాజకీయాలు చేయొద్దని సూచించారు. 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు రాశారని చెప్పారు. వీరిలో 15వందల 63 మంది విద్యార్థులకు సంబంధించిన సమస్యను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. దేశంలో నీట్, ఏఇఇ, తదితర పరీక్షలను విజయవంతగా నిర్వహిస్తోందన్నారు

మరోవైపు 15వందల 63 మంది విద్యార్థుల గ్రేస్ మార్కులను తొలగిస్తున్నట్లు తెలిపింది. వీరికి జూన్ 23న మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. మళ్లీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈమెయిల్, మెసేజ్ ల ద్వారా సమాచారం అందిస్తామని తెలిపింది

## మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం..

# 16,347 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సాయంత్రం సచివాలయం మొదటిబ్లాక్‌లో తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.



వెలగపూడి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.41 గంటలకు సచివాలయం మొదటిబ్లాక్‌లోని తన ఛాంబర్‌లో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం హోదాలో సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు వివిధశాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు.. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ దస్త్రంపై సీఎం మొదటి సంతకం చేశారు. (కేటగిరిల వారీగా పోస్టుల వివరాలు: ఎస్‌జీటీ : 6,371బీ పీఈటీ : 132బీ స్కూల్ అసిస్టెంట్స్: 7725బీ టీజీటీ: 1781బీ పీజీటీ: 286బీ ప్రిన్సిపల్స్: 52) ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై రెండో సంతకం, సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై

నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేశారు.

# వలంటీర్ వ్యవస్థను రద్దు చేయలేదు




**వారి ద్వారానే పెన్షన్లు అందచేస్తాం**

**ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా నిర్ణయాలు**

**మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**

**అమరావతి:** వలంటీర్ వ్యవస్థపై మంత్రి నిమ్మల రామానాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వాలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ కొనసాగుతోంది. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించారు. రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థ ఇంకా రద్దు కాలేదని స్పష్టం చేశారు. కేవలం ఎన్నికల సమయంలో తాత్కాలికంగా వారిని విధుల నుంచి దూరం పెట్టినట్లు చెప్పారు. వాలంటీర్లు.. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందుతున్న వ్యక్తులని పేర్కొన్నారు. త్వరలోనే ప్రభుత్వం ఈ వ్యవస్థపై సమీక్ష నిర్వహిస్తుందని, వారిని ప్రజాసేవ కోసం వినియోగించుకుంటుందని చెప్పారు. ప్రజలకు ఇంటి వద్దే పింఛను అందించే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కొక్కటిగా అన్ని హామీలు నెరవేరుతాయని తెలిపారు. శాఖలవారీగా శ్వేత పత్రాలు విడుదల చేస్తామన్నారు. అలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ పెన్షన్ అందిస్తామని అన్నారు. వలంటీర్లతో రాజీనామా చేయించి జగన్ రోడ్డున పడేశారని మండిపడ్డారు. సచివాలయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చంద్రబాబు కేబినెట్ మంత్రులు తొలి అధికారిక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడుమాట్లాడారు. ఏపీ ప్రజల్లో 5 సంతకాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భద్రత భరోసా ఇచ్చారు. డీఎస్సీ మీద మొదటి సంతకం అని చెప్పారు...ఆ మాట నిలబెట్టుకున్నారు. జగన్ యువతను గంజాయి డ్రగ్స్‌కు బానిస చేశారు. ఈ రోజు నిరుద్యోగులకు చంద్రబాబు శుభవార్త ఇచ్చారు. 16307 పోస్ట్ లు భర్తీకి సంతకం చేశారు

. జగన్ మెగా డీఎస్సీ వేస్తాం, ప్రతి ఏడు వేస్తాం అన్నారు అయితే డీఎస్సీ వేయకుండా నిరుద్యోగులను మోసం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం.ల్యాండ్, మైన్, సాండ్‌లను గత వైసీపీ ప్రభుత్వం లూటీ చేసింది. భవిష్యత్తులో ప్రజల ఆస్తులను కొల్లగొట్టే పరిస్థితి. అందుకే ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారు.రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. గత ప్రభుత్వం ప్రైవేటు ఆస్తులు తమ గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేసింది. పెన్షన్ల విషయంలో మాజీ సీఎం జగన్ ఎన్నో అబద్దాలు చెప్పారు.

# ఇందిరమ్మ ఇళ్లపై కసరత్తు

హైదరాబాద్: ఎన్నికల కోడ్ ముగియడంతో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. మరోవైపు ఇళ్ల నిర్మాణానికి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా వేర్వేరు రాష్ట్రాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత రెండు పడక గదుల ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.7,740 కోట్లు కేటాయించింది. ఈ మేరకు మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. లబ్ధిదారులు అధికారుల పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణం చేసుకోవాల్సి ఉంటుందని, ఆ నిధులను నాలుగు దశల్లో ప్రభుత్వం విడుదల చేస్తుందని పేర్కొంది. పథకాన్ని ఈ ఏడాది మార్చి 11వ తేదీన భద్రాచలంలో సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఇళ్ల నమూనాలనూ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించటంతో హడ్కో సుమారు రూ.1,000 కోట్లు రుణంగా మంజూరు చేసింది. పట్టణ ప్రాంతాల ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత మొత్తం అందుతుంది. ఆయా లెక్కలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.

లబ్ధిదారుల ఎంపికే సవాల్

సంవత్సరానికి 4.50 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన అయిదేళ్లలో 22.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు అవకాశం ఉంది. వచ్చిన దరఖాస్తులు 82.82 లక్షలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వడపోత సవాల్‌గా మారింది. ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రభుత్వం నుంచి సూచనలు తీసుకున్న మీదటే ముందడుగు వేయాలని అధికారులు భావిస్తున్నారు.

# పోషకాహార లోపంతో విశ్వబాలలు!


నేటి బాలలే రేపటి పౌరులు. బాలల పెంపకంపైననే రేపటి దేశ భవిత ఆధారపడి ఉంటుంది. పిల్లల సంపూర్ణ శారీరక, మానసిక ఎదుగుదల తల్లిదండ్రులు, ప్రభుత్వాల మీదనే ఆధారపడి ఉంటాయి. శిశు పోషణ వల్ల వారి భవిష్యత్తు ఆరోగ్యం నిర్ణయించబడుతుంది. బాలల సమగ్రాభివృద్ధిలో తల్లితండ్రుల బాధ్యత అధికంగా ఉంటుంది. విశ్వ మానవాళికి సురక్షిత జీవనం, ఆరోగ్యం, ఆహారం, విద్య, మానవీయత లాంటి మౌళిక హక్కులు ఉంటాయి. ప్రపంచదేశాల్లో 385 మిలియన్ల బాలలు దారిద్య్రేఖ దిగువన, 153 మిలియన్ల అనాథలు దుర్భర జీవితాన్ని గడపడం విచారకరం. వీరిలో రోజుకు 8,500 మంది బాలలు పోషకాహారలోపంతో మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పిల్లలకు పోషకాహారలోపం, వస్త్రాల లభ్యతలో కొరత, అనారోగ్య సమస్యలు, అవిద్య, అలక్ష్యం, బాలకార్మిక వ్యవస్థ, లైంగిక వేదింపులు, అంతర్జాల అశ్లీలత లాంటి సమస్యలు వెన్నాడుతూనే ఉన్నాయి. విశ్వ బాలల సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని 1959లో ఐరాస తీర్మానం ప్రకారం ప్రతియేటా 20 నవంబర్ రోజున "ప్రపంచ/విశ్వ బాలల దినోత్సవం" నిర్వహిస్తున్నారు. 1949 నుండి కొన్ని దేశాల్లో 01 జూన్ రోజున బాలల దినాన్ని పాటించే ఆనవాయితీ కూడా ఉండేది.

భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా పేదరికం 21 శాతం తగ్గడం, శిశు మరణాలు సగానికి పైగా కట్టడి కావడం, 80 శాతానికి పైగా గర్భిణులు ఆసుపత్రుల్లో ప్రసవించడం లాంటి అనుభవాలతో పాటు 2 మిలియన్ల పిల్లలు బడులకు దూరమైపోవడం వంటి విభిన్న వాస్తవాలు బయట పడ్డాయి. దీనికి తోడుగా నిన్నటి కోవిడ్–19 కల్లోలం కారణంగా ఉద్భవించిన సామాజిక ఆర్థిక ప్రభావంతో అదనంగా మిలియన్ల 5 సంవత్సరాల లోపు వయస్సుగల బాలలు ప్రమాదకర పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, సగానికి పైగా బాలల మరణాలు నమోదు అవుతున్నాయని 'యూనిసెఫ్–2020 నివేదిక' కఠిన వాస్తవాలను వెల్లడించడం విచారకరం. ప్రతి ముగ్గురు బాలల్లో ఒక్కరు తీవ్ర పోషకాహారలోపంతో బాధ పడుతున్నారు. పోషకాహారలోపంతో బాధపడుతున్న బాలలకు కరోనా లాంటి అనేక అంటువ్యాధులు తొందరగా సోకుతాయని తెలుపుతున్నారు. కడుపేదరికం, పని దొరక్క పోవడం, ఆహార అభద్రత కారణాలు బాలల ఆరోగ్యంపై విష ప్రభావాన్ని చూపిస్తున్నాయి. విపత్తులు, ఉక్రెయిన్ యుద్ధం, ద్రవ్యోల్బణం పెరుగుదల వంటి ప్రతికూలతల ఫలితంగా పోషకాహార సరఫరా దెబ్బతిని, ధరలు పెరగడంతో బాలలు కనీస పోషకాహారానికి దూరం అవుతూ, తీవ్ర పోషకాహారలోప స్థితితో 38.4 శాతం బాలల శారీరక అభివృద్ధి ఆగిపోయిన కారణంగా వయస్సు కన్న అతి తక్కువ



ఎత్తుతో (స్టంటింగ్) పొట్టి వాళ్ళలా మారుతున్నారని కూడా గుర్తించారు. మన దేశంలో మగ శిశువుల కన్న ఆడ శిశు మరణాలు ఎక్కువగా నమోదు కావడం బాధాకరం. దీని కారణంగా మగ ఆడ పిల్లల నిష్పత్తి 1000:900 ఉండడం ప్రకృతి విరుద్ధమని తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా 5 ఏండ్ల లోపు బాలురు 7 శాతం మరణిస్తే, మన ఇండియాలో 11 శాతం బాలికలు మరణిస్తున్నారు. గ్రామీణ, పట్టణ మురికివాడలు, యస్‌సి, యస్‌టి, పేదకుటుంబాలకు చెందిన పిల్లల్లో పోషకాహారలోపం, ఆరోగ్యవసతుల లేమి, బాల్యవివాహాలు, పాఠశాలలకు పిల్లలు దూరమవడం, పరిసరాల మరియు వ్యక్తిగత అపరిశుభ్రత, సురక్షిత త్రాగునీరు లేకపోవడం లాంటి సమస్యలు చుట్టు ముడుతున్నాయి. దేశ కౌమారదశ (10 – 19 ఏండ్ల) పిల్లల జనాభా 253 మిలియన్లు ఉన్నది. బాల్యవివాహాలు చేసుకున్న కూతుర్ల సంఖ్యలో ప్రపంచ దేశాల్లో భారత్ 4వ స్థానంలో ఉంది. వీరిలో అనారోగ్యం, చిన్నతనంలోనే తల్లి కావడం, పోషకాహారం అందకపోవడం, ఆర్థిక వెనుకబాటు, సంతానం బలహీనంగా ఉండటం వంటి సమస్యలు వెన్నాడుతాయి. కౌమారదశ బాలికల్లో 54 శాతం, 30 శాతం బాలురు రక్తహీనత సమస్యలతో సతమతం అవుతున్నారు. మన దేశంలో 60–90 శాతం బాలికలు ఏదో ఒక సందర్భంలో లైంగిక అత్యాచారాలు, హింసలు లేదా వేధింపులను అనుభవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 189 దేశాల మానవ అభివృద్ధి సూచిక జాబితాలో ఇండియా 130వ స్థానంలో ఉన్నది. భారతదేశ భాగ్యవిధాతలుగా ఎదగాల్సిన బాలలు ఆహారకొరత, పోషకాహారలోపం, అనారోగ్యం, అవిద్య, బాలకార్మిక వ్యవస్థ, బాలల లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు లాంటి తీవ్ర సమస్యలతో సంసారం చేస్తున్నారు.కరోనాకు ముందు ప్రపంచవ్యాప్తంగా 47 మిలియన్ల బాలలు పోషకాహార (వేస్టింగ్) సమస్యలతో సహజీవనం చేస్తే, ప్రస్తుత కరోనా అనంతర కాలంలో వారి సంఖ్య 54 మిలియన్లకు చేరడం మ్మొదటి సారి ఈ మిలినియంలో జరిగింది. కరోనా వ్యాప్తితో పేద దేశాలలో పోషకాహార లోపంతో బాధపడుతున్న 5 ఏండ్ల లోపు బాలల సంఖ్య 14.3 శాతం పెరిగిందని గుర్తించారు. దీని పర్యవసానంగా సగానికి పైగా బాలలు పోషకాహారలోపంతో మరణిస్తున్నారని అనుమానిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా 250 మిలియన్ల బాలలకు విటమిన్–ఏ అందలేదని, దాదాపు 25 శాతం వరకు పోషకాహార లోపం పెరిగిందని తేల్చారు. వీటి ఫలితంగా 1.28 లక్షల అదనపు బాలల మరణాలు జరుగవచ్చని విశ్లేషించారు.

గర్భిణి స్త్రీలకు అందవలసిన సమతుల పోషకాహారం అందక పోవడం కూడా పరిస్థితి తీవ్రతను మరింత జటిలం చేస్తుందని నివేదిక తెలుపుతోంది. బాలలకు జీవించడం, శారీరకంగా మానసికంగా ఎదగడం, వేధింపుల నుండి రక్షణ, అభివృద్ధిలో పాలుపం చుకోవడమనేవి రాజ్యాంగ హక్కులని గుర్తించింది. ఆకలి, అకాలమరణాలు, అత్యాచారాలు, బాలకార్మిక దురాచారం, అవిద్య, పోషకాహారలేమి లాంటి సవాళ్ళను దేశం సమర్థవంతంగా ఎదుర్కోవలసి ఉంది. మన దేశంలో 2012–17 మధ్య కాలంలో 2.43 లక్షల బాలికలు/మహిళలు కనబడకుండా పోయారని విషయం విస్మయాన్ని కలుగజేస్తున్నది. రేపటి పౌరుల పోషకాహార హక్కులను కాపాడేందుకు ఆయాదేశాల ప్రభుత్వాలు, సామాన్య ప్రజలు, స్వచ్ఛంధ సంస్థలు, దాతలు వెంటనే స్పందించాల్సి ఉంది. ఆహార ఉత్పత్తి రంగాల ప్రోత్సాహం,ఆహార సరఫరా నియంత్రణ, తల్లిపాల రక్షణ, బాలలకు, తల్లులకు సమతుల ఆహార లభ్యతలను కాపాడాల్సి ఉంది.




వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
శుక్రవారం 14 జూన్ 2024


# విమానయాన రంగాన్ని ఆధునీకరిస్తాం

**న్యూఢిల్లీ:** కింజారపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో కేంద్ర పౌర విమానా శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. దేశంలో అత్యంత పిన్న వయసులో కేంద్ర కేబినెట్ మంత్రి పదవి రామ్మోహన్ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీకాకుళం ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు తనకు కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ప్రధాని నరేంద్ర మోదీ.. పౌర విమానయాన శాఖ అప్పగించారన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్ని శాఖలను మోదీ కోరారని మంత్రి చెప్పుకొచ్చారు. 'కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. భగవంతుడు, మా నాన్న ఎర్రన్న నాయుడు ఆశీస్సులు నాకు ఉన్నాయి. బాధ్యత రావడానికి కారణమైన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, శ్రీకాకుళం తెలుగు ప్రజలకు ధన్యవాదాలు. పౌర విమానయాన శాఖ కేటాయించిన మోదీకి కృతజ్ఞతలు. దేశంలో, ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి సాధిస్తున్న రంగం విమానయాన రంగం. యువతకు బాధ్యత ఇస్తే సమర్థవంతంగా నిర్వహిస్తారని మోదీ నాకు ఈ బాధ్యత అప్పగించారు. నా శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తాను.

# జగన్ బొమ్మతో స్కూల్ కిట్ బ్యాగులు

### పిల్లలకు పంపిణీలో అభ్యంతరం చెప్పని బాబు



**అమరావతి:** చంద్రబాబు పాలనలో పగ, ప్రతీకారాలకు చోటుండదంటూ టీడీపీ తన అధికారిక వెబ్ సైట్లో స్పష్టం చేసింది. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా మాజీ సీఎం జగన్ బొమ్మ ఉన్న స్కూల్ బ్యాగులను ఈ ఏడాది తమ తెలుగుదేశం ప్రభుత్వంలో కూడా పంపిణీ చేసేందుకు మార్గం సుగమం చేసింది. ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో కొన్ని పాలనాపరమైన మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. తాజాగా ఈవిషయాన్ని తిరుమల వేదికగా నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రం చాలా వెనుకబడిందన్నారు. అందులో భాగంగానే మాటలకు తగ్గట్టు చేతలకు పనిపెట్టారు. గతంలో విద్యా కనుక పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బడికి వెళ్లే పిల్లలకు ఒక కిట్‌ను అందజేశారు. అందులో స్కూల్ బ్యాగు, నోట్ పుస్తకాలు, యూనిఫారం, బూట్లు, సాక్సులు, బెల్ట్, టై అన్నింటినీ కలిపి విద్యార్థులకు అందజేసేవారు. అయితే అలా పంపిణీ చేసే కిట్ పై జగన్ బొమ్మను ముద్రించి ఇచ్చే వారు. అయితే ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో గత ఏడాది జగన్ బొమ్మను ముద్రించి ఉంచిన విద్యాకానుక కిట్‌నే పంపిణీ చేయాల్సి వచ్చింది. దీనికి కారణం పాత వాటిని పక్కనపెట్టి.. కొత్తగా కిట్‌ను తయారు చేసి పిల్లలకు అందజేయాలంటే నిధులు వెచ్చించాల్సి వస్తుంది. దీంతో ప్రభుత్వ ఖజానాలోని నిధులు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంటుంది. కనుక జగన్ ఫోటో ఉన్న బ్యాగులను పంపిణీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ఈ ప్రభుత్వం. దీంతో తెలుగుదేశం హయాంలో కూడా స్కూల్ పిల్లలు మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మను కలిగిన స్కూల్ కిట్?ను తీసుకోవాల్సి వచ్చింది. దీనికి తెలుగుదేశం పార్టీ తమ అధికారిక వెబ్ సైట్లో ఒక సందేశాన్ని జోడించింది. గతంలో ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబుకు ఎక్కడ మంచిపేరు వస్తుందో అనే ఆలోచనతో అన్నా క్యాంటీన్లను రద్దు చేసి.. పేదల కడుపు కొట్టిన గత ముఖ్యమంత్రికి, ప్రస్తుతం నిధులు దుర్వినియోగం చేయకూడదు అన్న ఆలోచనతో కూడిన సీఎం చంద్రబాబుకు ఉన్న వ్యత్యాసం ఇదే అని తెలిపింది. అందుకే గత ముఖ్యమంత్రిలాగా కాకుండా విద్యాకానుక కిట్లపై జగన్ బొమ్మలు ఉన్నప్పటికీ వాటిని అలాగే పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. తమ పాలనలో పగ, కక్షసాధింపు చర్యలు ఉండవన్నదానికి ఇదే ఒక ప్రత్యేక ఉదాహరణ అంటూ సందేశాన్ని కూడా ఇచ్చారు. ఈ ఫోటో సామాజిక మాధ్యమాల్లో తెగవైరల్ అవుతోంది.

# కాశ్మీర్‌లో ఉగ్రదాడులపై కేంద్రం సీరియస్

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రదాడిపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. అక్కడి భద్రతపై సమీక్ష జరిపారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు అవసరమైన సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని అధికారులకు సూచించారు. గత నాలుగు రోజులుగా జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడులు జరుగుతున్నాయి. భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు ముష్కరులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పాకిస్థాన్‌కి చెందిన ఉగ్రవాదులే ఈ దాడులకు తెగబడుతున్నట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొందరి ఊహా చిత్రాలనూ విడుదల చేశారు. ఈ క్రమంలోనే మోదీ అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ భేటీలో అజిత్ దోవల్ మోదీ అక్కడి స్థితిగతులూ పూర్తి స్థాయిలో వివరించారు. సాయుధ బలగాలు ఈ దాడులను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు చేపడుతుందో కూడా తెలిపారు. ఈ మేరకు మోదీ కొన్ని సూచనలు చేశారు. అవసరమైనతే భారీ మొత్తంలో సాయుధ బలగాలను మొహరించి ఉగ్రవాదుల్ని ఏరి వేయాలని ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనిపైనే మోదీ అమిత్ షాతో కూడా మాట్లాడారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోనూ ప్రధాని మోదీ మాట్లాడారు. స్థానిక అధికార యంత్రాంగం ఉగ్రదాడులను అడ్డుకునేందుకు ఎలాంటి చర్యలు చేపడుతోందో అడిగి తెలుసుకున్నారు. దొడ జిల్లాలో మరోసారి ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఓ సైనికుడు గాయపడ్డాడు. దొడ జిల్లాలో ఇలా దాడి జరగడం రెండోసారి. నాలుగు రోజుల్లో నాలుగు సార్లు జమ్ముకశ్మీర్‌లో కాల్పుల మోత మోగింది. జూన్ 9వ తేదీన రేసీ జిల్లాలో ఓ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో 9 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తరవాత భద్రతా బలగాలు ఉగ్రవేట మొదలు పెట్టాయి. కథువా జిల్లాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. దొడలో ఎత్తైన పర్వతాల్లో నలుగురు ఉగ్రవాదులు నక్కి ఉన్నారు. అక్కడి వరకూ వెళ్లి వాళ్లను మట్టుబెట్టడం సవాల్‌గా మారుతోంది. చత్తర్‌గల్లా వద్ద వాళ్ల కోసం గాలిస్తుండగా ఉన్నట్టుండి భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు ఉగ్రవాదులు. ఈ ఘటనలో రాష్ట్రీయ రైఫిల్స్‌కి చెందిన ఐదుగురు సైనికులతో పాటు ఓ సీనియర్ పోలీస్ అధికారి గాయపడ్డారు.

# కెసిఆర్‌పై ఇడి కేసు నమోదు

### గొర్రెల కుంభకోణంలో విచారణ : ఎంపి రఘునందన్

**మెదక్:** మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎంపీ ఎం. రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేసు నమోదు చేశారని అన్నారు.ఇప్పుడే ఆ కేసు నమోదైందని అన్నారు. అనంతరం కేసీఆర్ ను విచారణ చేసేందుకు ఈడీ అధికారులు కూడా వచ్చినట్లు చెప్పారు. గొర్రెల కొనుగోలు వ్యవహారంలో ఈడీ ఈ కేసు నమోదు చేసిందని వ్యాఖ్యలు చేశారు. మెదక్ పట్టణ కేంద్రంలో జరిగిన దిల్ సే ములాఖాత్ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం హవెలి ఘన్పూర్ మండలం ముత్తాయిపల్లి శివాలయంలో కూచానపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో రఘునందన్ రావు పూజలు చేశారు. తర్వాత మెదక్ పట్టణంలో పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు.

# రాష్ట్రంలో మహిళాశక్తి క్యాంటీన్లు



**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 'మహిళా శక్తి క్యాంటీన్ సర్వీస్'లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్రంలో క్యాంటీన్ సర్వీస్‌ల ఏర్పాటుపై గురువారం సచివాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా చేపట్టారు. సమావేశానికి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, టూరిజం శాఖ డైరెక్టర్ నిఖిల, టూరిజం కార్పొరేషన్ ఎండీ రమేష్ నాయుడు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా సంఘా లను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాల యాలు, బస్ స్టాండ్‌లు పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళా సంఘాల నిర్వహణలో ప్రత్యేకంగా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇప్పటికే 'అన్న' క్యాంటీన్ల పేరుతో కేరళలో, దీదీకా రసోయ్ అనే పేరుతో బెంగాల్‌లో నడుస్తున్న క్యాంటీన్‌ల పనితీరుపై అధ్యయనం చేసినట్లు వివరించారు. రానున్న రెండేళ్లలో కనీసం150 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఈ క్యాంటీన్‌ల నిర్వహణను గ్రామైక్య సంఘాలకు అప్పగించనున్నట్టు తెలిపారు. క్యాంటీన్ నిర్వహణపై ఈ సంఘాలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ క్యాంటీన్‌ల పనితీరు, నిర్వహణ, వీటి ఏర్పాటుకు ఎంత విస్తీర్ణంలో స్థలం అవసరం, వీటి ఏర్పాటుకు రోడ్ మ్యాప్ తదితర అంశాలపై సవివరంగా ప్రణాళికను రూపొందించాల్సింగా గ్రామీణా భివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ కమిషనర్‌ను సీఎస్ ఆదేశించారు.

# తెలంగాణలో పెద్దలందరికీ వైద్య పరీక్షలు

**హైదరాబాద్:** ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఇక పాలనపై సిఎం రేవంత్ దృష్టి సారించారు. ఇచ్చిన హామీల అమలు, కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారు. ఒక్కో కార్యక్రమాన్ని పట్టాలకు ఎక్కించడం ద్వారా తెలంగాణలో ఆదర్శ పాలనకు తెరతీసే ప్రయత్నంలో ఉన్నారు. గత పదేళ్లో విధ్వంసం అయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేపట్టారు. విద్య,వైద్య రంగాలను ఆదర్శంగా తీర్చిదిద్దే సంకల్పంతో కార్యాచరణకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో పెద్దలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం అవుతోంది. పెరుగుతున్న జీవనశైలి వ్యాధులను అరికట్టేలా పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ కోసం 10 మొబైల్ ల్యాబ్స్ సిద్ధం చేసినట్లు చెప్పారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టనుండగా.. కేంద్రం నుంచి 60 శాతం నిధులు సమకూరనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చనుంది. గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు ముందస్తు పరీక్షలు నిర్వహించడం ద్వారా సకాలంలో చికిత్స అందించే వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అధ్యయనాల ప్రకారం తెలంగాణలో గత 20 ఏళ్లలో హృద్రోగాలు, క్యాన్సర్, మధుమేహం, బీపీ వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నట్లు తేలింది. దాదాపు 60 శాతం వ్యాధులు ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్స్ వల్లే వస్తున్నాయని అంచనా వేస్తున్నారు. అయితే, రొమ్ము క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధుల విషయంలో ఒక శాతంలోపే మహిళలు ముందస్తు పరీక్షలు చేయించు కుంటున్నారని లెక్కలు చెబుతున్నాయి. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది వంద శాతం వరకూ ఉంటోంది. ప్రజలందరికీ ముందస్తు పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆయా వ్యాధులను నిర్ధారించి సకాలంలో వైద్య చికిత్సలు అందించడానికి వీలు కలుగుతుందని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఊరూరా తిరుగుతూ 26 – 70 ఏళ్ల వయసున్న అందరికీ డిజిటల్ మయోగ్రామ్, పాప్‌స్మెర్, ఈసీజీ, ఈ2డీ ఏకో సహా ఇతర అన్ని బ్లడ్ టెస్టులు నిర్వహిస్తారు. దీనికి అనుగుణంగా ఏర్పాటు చేసిన మొబైల్ ల్యాబ్స్‌లో వైద్యులతో పాటు నర్సులు, ఇతర టెక్నీషియన్లు అందుబాటులో ఉంటారు. ప్రధానంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లు, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులకు సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. పురుషుల్లో నోటి క్యాన్సర్‌తో పాటు షుగర్, బీపీ, గుండె వ్యాధులపై పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి హైదరాబాద్ ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రికి తరలిస్తారు. అక్కడ బయాప్సీ వంటి తదుపరి పరీక్షలతో వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. ఒకవేళ షుగర్, బీపీ వంటి సమస్యలుంటే బాధితులకు ఉచితంగా మందులు అందిస్తారు. వారి వారి గ్రామాలకు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వారిని అనుసంధానం చేసి అక్కడి నుంచి ప్రతి నెలా మెడిసిన్స్ తీసుకునేలా చర్యలు చేపట్టనున్నారు. ఒకవేళ బాధితులు ఎవరైనా ఆస్పత్రికి రాలేని స్థితిలో ఉంటే వారి ఇళ్ల వద్దకే ఆరోగ్య సిబ్బంది మందులు సరఫరా చేసేలా చూస్తారు.

# దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంచుతాం



**న్యూఢిల్లీ:** బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. విదేశాలపై ఆధారపడే రోజులు పోయేలా చూస్తామని అన్నారు. మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని కిషన్‌రెడ్డి అన్నారు. అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. దిల్లీలో గురువారం ఆయన కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మనం ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నాం. రానున్న రోజుల్లో దిగుమతి తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుతాం. ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తాం. బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖల అధికారులు ఒక బృందంగా నిబద్ధతతో పనిచేస్తాం కిషన్‌రెడ్డి చెప్పారు. బొగ్గు, గనుల శాఖ మంత్రి తనకు ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యతలు అప్పగించారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దేశంలో విద్యుత్ లేకుండా, ఏ పని కూడా కాదని.. విద్యుత్ కోతల కారణంతో అనేక మంది రైతులు దేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మోదీ వచ్చిన తర్వాత విద్యుత్ కష్టాలు లేవన్నారు. పవర్ మినిస్ట్రీ, రైల్వే మినిస్ట్రీ, పర్యావరణ శాఖలకు, బొగ్గు గనుల శాఖకు అనుబంధం ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. అన్ని మంత్రిత్వ శాఖలను కలుపుకొని ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మనకు కావాల్సిన బొగ్గును మనం ఉత్పత్తి చేసుకుంటామని వెల్లడించారు. ఉపాధి అవకాశాలు పెంచడంపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. భారత్ మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు అందరం పని చేయాలన్నారు. ప్రధాని మోదీ దేశ ఆకాంక్షలు కోసం ముందుకు వెళుతున్న ఆయనతో పాటు అందరూ నడవాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు.

# రాజ్యసభ రేసులో అజిత్ పవార్ భార్య సునేత్ర నామినేషన్ దాఖలు చేసిన ఎన్సీపి నేత

**న్యూఢిల్లీ:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ గురువారం రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బారామతి లోక్‌సభ స్థానం నుంచి సునేత్ర పవార్ బరిలో దిగారు. అయితే ఎన్సీపీ అభ్యర్థి, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సులే చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో సునేత్ర.. రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. జూన్ 25వ తేదీన రాజ్యసభ ఉప ఎన్నిక జరగనుంది. అయితే ఈ రాజ్యసభ సీటును పలువురు ఆశించారని... అందులో తాను కూడా ఉన్నానని ఈ సందర్భంగా మహారాష్ట్ర మంత్రి చగన్ భుజ్‌బల్ వెల్లడించారు. కానీ సునేత్ర పవార్‌ను ఈ ఉప ఎన్నికలో బరిలో నిలపాలని పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని తెలిపారు.

# కాళేశ్వరం విచారణ కమిషన్ ముందుకు ఇంజనీర్లు హైడ్రాలజీ ఇంజనీరింగ్ కమిటీ నిపుణులు

**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగుబాటు, పియర్స్, గేట్లు దెబ్బతినడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీలు సహా పలు సమస్యలపై విచారణ కొనసాగుతోంది. విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ కమిషన్ను హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లు కలిశారు. ఈ మేరకు రెండు వారాల లోపు మధ్యంతర నివేదిక, సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని రెండు కమిటీల ఇంజినీర్లను కమిషన్ ఆదేశించింది. టెక్నికల్ అంశాలకు సంబంధించిన విషయంలో అఫిడవిట్ ÷ల్ చేయాలని నిపుణుల కమిటీలకు ఆయన సూచించారు. జూన్ 14న మరి కొంతమంది అధికారులు, ఇతర వ్యక్తులు విచారణకు హాజరు కావాలని కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ ఆదేశించారు. త్వరలోనే ఆయన మరోసారి సడన్ ఫీల్డ్ విజిట్ చేయనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణకు సిద్ధమవుతోంది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసిన ప్రతి ఒక్కరినీ బహిరంగ విచారణలో భాగస్వామ్యం చేయనున్నారు. విజిలెన్స్ రిపోర్టు ఇవ్వాలంటూ కమిషన్ ప్రభుత్వాన్ని గతంలో ఆదేశించినప్పటికీ ఇంతవరకూ రిపోర్టు కమిషన్‌కు అందలేదు. దీంతో విజిలెన్స్ రిపోర్టు కోసం మరోసారి ప్రభుత్వం, విజిలెన్స్ శాఖకి లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది. టెక్నికల్ అంశాలు పూర్తయిన తర్వాత ఆర్థికపరమైన అంశాల మీద దృష్టి పెట్టనున్నట్లు సమాచారం.

# నామినేటెడ్ పదవులపై ఆశ

**హైదరాబాద్:** పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియడంతో నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరుసగా ఎన్నికల్లో శ్రమించిన నాయకులు, కార్యకర్తలు ఈ పదవుల కోసం కొన్నాళ్లుగా వేచిచూస్తున్నారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లు నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఆలయాల కమిటీ ఛైర్మన్ల పదవుల కోసం ముందస్తుగా నేతల వద్ద పైరవీలు వేసేస్తున్నారు. పదవుల కోసం ఎమ్మెల్యేలు, కీలక నేతల చుట్టూ చక్కర్లు కొడుతు, హామీలు తీసుకుంటున్నారు.

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల ఆశలు పెరిగిపోయాయి. లోక్ సభ ఎన్నికలు ముగియడంతో త్వరలోనే భారీ సంఖ్యలో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారన్న ఊహాగానాలతో నాయకులు, కార్యకర్తలో జోష్ పెరిగింది. జిల్లాలో అసెంబ్లీ, ఎమ్మెల్సీ బై పోల్, ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నేతలు స్థానిక సంస్థల్లో పోటీ చేయడంతో పాటు నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ ఛైర్మన్లు, జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ, దేవాలయాల ఛైర్మన్లు పోస్టులపై హస్తం పార్టీ నేతలు కన్నేశారు. ఇప్పటికే లోక్ సభ ఎన్నికల ముందు రాష్ట్రస్థాయిలో పలువురు సీనియర్ నేతలకు పదవులు వరించాయి. దీంతో ఈ దఫా తమకు అవకాశం దక్కుతుందని ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రస్థాయితో పాటు జిల్లా స్థాయిలోని నామినేటెడ్ పదవుల కోసం నేతల్లో విపరీతమైన డిమాండ్ నెలకొంది. పార్టీ ప్రభుత్వంలోకి తీసుకువచ్చేందుకు ఎన్నికల్లో కీలక భూమిక పోషించిన నాయకులు ఈ నామినేటెడ్ పోస్టులపై గురిపెట్టారు. కొంతమంది స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతుండగా.. మిగిలిన వారు నామినేటెడ్ పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. పదేళ్ల పాటు ప్రతిపక్షానికి పరిమితం కావడంతో ఏదో ఒక రూపంలో ఇప్పుడు కచ్చితంగా అవకాశం పొందాల్సిందేనని భావిస్తున్నారు.

వేగుచుక్క
శుక్రవారం 14 జూన్ 2024








# దిశా పటానీ బర్త్‌డే...కొత్త పోస్టర్ విడుదల


ప్రభాస్ అభిమానులతో పాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 . ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశా పటానీ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. అయితే నేడు దిశా పటానీ పుట్టినరోజు ఈ సందర్భంగా మేకర్స్ బర్త్ డే విషెస్ తెలుపుతూ దిశా పటానీ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇక ఈ చిత్రంలో దిశా రోక్సి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.ఈ సినిమాకు మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తుండగా.. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్విన్ దత్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు సినిమా రానుంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, పశుపతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# దుల్కర్ లక్కీ భాస్కర్ టీజర్‌కు మంచి స్పందన




పాన్ ఇండియా స్థాయి ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ఈ టాలెంటెడ్ యాక్టర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'లక్కీ భాస్కర్' మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. లక్కీ భాస్కర్ సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు ఇన్‌సైడ్ టాక్. పవన్ కల్యాణ్ నటిస్తోన్న ఓజీ ఇదే రోజు రావాల్సి ఉండగా.. 2025కు వాయిదా పడ్డది. ఇక జూనియర్ ఎన్టీఆర్ దేవర కూడా ఇదే తేదీన వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లక్కీ భాస్కర్ విడుదలపై కొంత డైలమా ఏర్పడింది. సినిమా విడుదలపై క్లారిటీ కోసం ఎదురుచూస్తున్న మూవీ లవర్స్‌లో కొత్త అప్‌డేట్‌తో జోష్ నింపారు మేకర్స్. జూన్ 17న లక్కీ భాస్కర్ ఫస్ట్ సింగిల్‌ను లాంఛ్ చేస్తున్నట్టు ప్రకటించారు. అతడొక సాధారణ వ్యక్తి. సాధారణ భారతీయ మధ్యతరగతి వ్యక్తి.. నమ్మదగిన వ్యక్తి.. ఒక సాధారణ బ్యాంక్ ఉద్యోగి ఖాతాలో ఇంత డబ్బా.. అంటూ సాగే డైలాగ్స్ తో సాగుతున్న టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. మధ్యతరగతి బ్యాంక్ ఉద్యోగి ఖాతాలోకి అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనేది సస్పెన్స్‌లో పెడుతూ కట్ చేసిన టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో మీనాక్షి చౌదరి సుమతి పాత్రలో కనిపించనుంది. లక్కీ భాస్కర్ ఎక్స్‌ట్రా ఆర్డినరీ ప్రపంచం చాలా సస్పెన్స్ ఎలిమెంట్స్ తో ఉండబోతున్నట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్.ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తుండగా .. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నా

# బార్డర్ మూవీ సీక్వెల్‌పై సన్నీ డియోల్ దృష్టి



బాలీవుడ్ నటుడు సన్నీదేవోల్ ప్రస్తుతం సీక్వెల్‌లపై దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. గతేడాది గదర్ 2తో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ నటుడు ఇప్పుడు మరో బ్లాక్ బస్టర్ సినిమాకు సీక్వెల్ ప్రకటించాడు. అగ్రనటులు సన్నీదేవోల్, జాకీష్రాఫ్, సునీల్‌శెట్టి, అక్షయ్‌ఖన్నా ప్రధాన పాత్రల్లో వచ్చిన సినిమా బోర్డర్ .. భారత్ పాకిస్థాన్ 1971 యుద్ధ నేపథ్యంలో 1997లో విడుదలైన ఈ చిత్రం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం

కురిపించింది. జేపీ దత్తా దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి అను మాలిక్, ఆదేశ్ శ్రీవాస్తవ సంగీతం అందించగా.. కేవలం రూ.10 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 65 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా విడుదలై నేటికి 27 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మూవీ సీక్వెల్‌ను అనౌన్స్ చేశారు మేకర్స్. దీనితో పాటు స్పెషల్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. 27 ఏళ్ల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు మళ్లీ తిరిగి వస్తోంది. బోర్డర్ 2 సినిమాకు అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహించనుండగా.. భూషణ్‌కుమార్, కృష్ణన్‌కుమార్, జేపీదత్తా, నిధిదత్తా కలిసి నిర్మిస్తున్నారు. ఆయుష్మాన్ ఖురానా ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం.

# ఓ మంచి ఘోస్ట్‌గా వస్తున్న వెన్నెల కిషోర్




వెన్నెల కిషోర్, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్' . ఈ మధ్య హారర్, కామెడీ చిత్రాలను ప్రేక్షకులు ఎలా ఆదరిస్తున్నారో తెలిసిందే. థియేటర్లలోనే కాకుండా.. ఓటీటీలోనూ ఈ జానర్ సినిమాలు మంచి స్పందనను రాబట్టుకుంటున్నాయి. ఇప్పుడీ సినిమా కూడా అదే జానర్‌లో రాబోతోంది. కామెడీ స్పెషలిస్ట్ వెన్నెల కిషోర్, హారర్ స్పెషలిస్ట్ నందితా శ్వేత కలిసి నటిస్తోన్న ఈ సినిమా మొదటి నుంచి మంచి అంచనాలే ఉన్నాయి. ఈ సూపర్ కాంబినేషన్‌లో 'ఓ మంచి ఘోస్ట్' సినిమాను జూన్ 21న విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ 'ఓ మంచి ఘోస్ట్' చిత్రంలో షకలక శంకర్, నవమి గాయక్, నవీన్ నేని, రజత్ రాఘవ్, హాస్యనటుడు రఘుబాబు తదితరులు ఇతర పాత్రలలో నటించారు. డా. అబినికా ఇనాబతుని నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపొందగా.. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందించారు. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్, లిరికల్ సాంగ్, టీజర్‌లు మంచి స్పందనను రాబట్టుకోవడంతో.. చిత్ర విజయంపై టీమ్ అంతా ఎంతో నమ్మకంగా ఉన్నారు.

# ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్

## డ్రాగన్ గా పేరును పరిశీలిస్తున్న టీమ్



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దీనికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. దేవర' పూర్తి కాగానే ప్రశాంత్ నీల్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తారని టాక్. ఈలోగా మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని ఎంపిక చేసే పనిలో పడింది చిత్రబృందం. కథానాయికగా రష్మిక ఖరారు అయినట్లు తెలుస్తోంది. ప్రతినాయకుడి పాత్రకు బాలీవుడ్ నటులను తీసుకునే అవకాశం ఉంది. అందుకోసం సంప్రదింపులు కూడా మొదలయ్యాయి. ప్రస్తుతానికి సీనియర్ నటుడు బాబీ డియోల్‌తో దర్శక నిర్మాతలు మాట్లాడుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం బాబీ డియోల్ సౌత్ ఇండియన్ సినిమాపై ఫోకస్ పెట్టాడు. 'హరి హర వీరమల్లు' సినిమాలో ఔరంగజేబ్ పాత్ర పోషిస్తున్నాడు. ఇప్పుడు 'డ్రాగన్' కూడా ఒప్పుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. పారితోషికం, డేట్లు అన్నీ సర్దుబాటు అయితే బాబీ డియోల్ ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చేసినట్టే. ఎన్టీఆర్ ప్రస్తుతం 'దేవర' షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. ఇటీవల గోవాలో ఓ కీలకమైన షెడ్యూల్‌ని పూర్తి చేసుకుని హైదరాబాద్ తిరిగొచ్చారు.

# సమంత ఆయనకే లిఫ్ట్ ఇస్తుందా?



**సమంత** అమెరికా నుంచి తిరిగొచ్చి నెలలు గడుస్తోంది. కానీ ఇంతవరకూ కొత్త ప్రాజెక్ట్ ప్రకటించింది లేదు. కానీ సమంత కున్న క్రేజ్ తో అవకాశాలు పెద్ద కష్టం కాదు. ఆమె ఆచితూచి అడుగులు వేస్తుంది. కొడితే కుంభ స్థలాన్నే కొట్టలని సీరియస్ గా ఉంది. బాలీవుడ్ లో సీరియస్ గా ట్రై చేస్తుందని చాలా కాలంగా వినిపిస్తుంది కానీ ఇంతవరకూ అక్కడా ఒక్క ప్రాజెక్ట్ కి కూడా అధికారికంగా సైన్ చేసింది లేదు. ఇటు తెలుగులోనూ కొత్త సినిమాలు వేటికి కమిట్ అవ్వలేదు.

ఈ నేపథ్యంలో సమంత గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వెలుగులోకి వస్తుంది. మలయాళంలో ఓ సినిమాకి సైన్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. అందులో మమ్ముట్టి కి జోడీగా నటిస్తుందని సమాచారం. ఆ చిత్రాన్ని గౌతమ్ మీనన్ తెరకెక్కిస్తున్నాడు. సామ్ సహా గౌతమ్ కి అక్కడ ఇదే తొలి ప్రాజెక్ట్. ఇంతవరకూ ఇద్దరు అక్కడ సినిమాలు చేసింది లేదు. అయితే ఇక్కడో విషయం చెప్పాలి. ఇదే నిజమైతే గౌతమ్ మీనన్ కే సమంత ఛాన్స్ ఇచ్చినట్లు అవుతుంది. ఎందుకంటే గౌతమ్ మీనన్ కి దర్శకుడిగా పెద్దగా అవకాశాలు రావడం లేదు. దీంతో చాలా కాలంగా ఆయన నటుడిగా కొనసాగుతున్నాడు. చిన్న చిన్న పాత్రలు సైతం పోషిస్తున్నాడు. బేసిక్ గా నటనంటే ఆసక్తే. కానీ ఒకప్పుడు స్టార్ డైరెక్టర్ గా వెలిగిన గౌతమ్ మీనన్ అలాంటి పాత్రలు పోషించడం ఆశ్చర్యకరం. ఇలాంటి ఫేజ్ లో సమంత మళ్లీ అతనితో సినిమా చేయడం ఇంట్రెస్టింగ్. సమంతని ఇండస్ట్రీకి పరిచయం చేసింది గౌతమ్ మీనన్ అన్న సంగతి తెలిసిందే.ఏమాయ చేసావే సినిమాతో ఆయనే హీరోయిన్ గా టాలీవుడ్ లో లాంచ్ చేసాడు. ఆ సినిమా పెద్ద విజయం సాధించడంతో సమంత క్రేజీ బ్యూటీగా మారిపోయింది. ఒక్క విజయం సమంత జీవితాన్నే మార్చేసింది. అక్కడ నుంచి తమిళ్ లోనూ స్టార్ హీరోయిన్ గా ఫేమస్ అయింది. అక్కినేని ఇంట కోడలి స్థానాన్ని సైతం కట్టబెట్టింది. చైతన్యతో విడిపోవడం అన్నది వేరే సంగతి అనుకోండి.

# అప్పుడు హీరోయిన్ ఇప్పుడు అతిధిగానా?



**కొంత** కాలంగా నిత్యామీనన్ కెరీర నత్తనడకన సాగుతోన్న సంగతి తెలిసిందే. సినిమా ఛాన్సులు తగ్గడంతో టీవీషోలతో బిజీ అయింది. అయినా సినిమాలు వదల్లేదు. వచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుం టుంది. అయితే గత ఏడాది కేవలం ఒక్క సినిమాకే పరిమితమైంది. అది మలయాళంలో నటించిన చిత్రం. తమిళ్ , తెలుగులో ఒక్క సినిమా కూడా చేయలేదు. అయితే 2024 లో మాత్రం మళ్లీ యాక్టివ్ అయినట్లు కనిపిస్తుంది.అమ్మడు జయం రవి సరసన కోలీవుడ్ లో ఓ సినిమా చేస్తుంది. అలాగే డియర్ ఎక్స్‌సెస్ అనే మరో సినిమాలో కూడా నటిస్తుంది. కానీ ఇంతవరకూ తెలుగు సినిమాకి మాత్రం సైన్ చేయలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ అప్ డేట్ అందుతోంది. యూత్ స్టార్ నితిన్ హీరోగా నటిస్తోన్న తమ్ముడు చిత్రం లో గెస్ట్ రోల్ కి సైన్ చేసిందని సమాచారం. ఇటీవలే దర్శకుడు వేణు శ్రీరామ్ ఆమెకి పాత్ర గురించి వివరించి ఒప్పించినట్లు లీకులందుతున్నాయి.

మరి ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది. గతంలో నితిన్ తో అమ్మడు రెండు సినిమాల్లో హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. తొలిసారి విక్రమ్ .కె కుమార్ తెరకెక్కించిన ఇష్క్ తో జోడీ కట్టారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. ఆ సినిమాతో ఈ జోడీకి రొమాంటిక్ పెయిర్ గా మంచి గుర్తింపు దక్కింది. ఆ క్రేజ్ తోనే మరోసారి గుండెజారి గల్లంతయ్యిందే సినిమాతో మళ్లీ తెరను పంచుకున్నారు.ఆ సినిమా కూడా మంచి విజయం సాధించింది. అప్పటి నుంచి హిట్ పెయిర్ గా మార్కెట్ లో ముద్ర పడిపోయింది. దీంతో ఇదే కలయికలో హ్యాట్రిక్ ప్లాన్ చేసే అవకాశాలున్నట్లు ప్రచారంలో ఉంది. కానీ నిత్య మీనన్ క్రేజ్ తగ్గడంతో అమ్మడికిప్పుడు ఆ ఛాన్స్ లేదు.